# ఊరు మెచ్చిన మనిషి

సెట్టుశెరి సగం పొద్దు. నాత్రి సిక్కగా సీకటిని ఈనుతుంది. గప్పుడు మా సిన్నోడు నా మీద రెండు కాళేసి పడుకున్నడు. నా నెత్తి దగ్గరున్న సెల్లు గుక్క తిప్పుకోకుండా ఒక్కటే మోగుతుంది. నాకు దిడ్డున మేల్కతట్టింది. సూస్తె కొత్త నెంబర్. ఏహే... ఎవడోతియ్. హెడ్క్ అని ఎత్తలే. నాకు ఊకే గట్లనే నాత్రిపూట ఆపతికేసులే ఒస్తవి. భయమైంది.

మల్ల రెండుసార్లు మోగింది. ఇంగిడ్వరు నాయనా... అని సెల్లు ఎత్తిన.

హలో.... ఎవరు? అని అంటి.

అన్న నేను అంజినన్నా అన్నడు.

ఎవరు... అని మల్ల అన్న.

గోదల్ అంజినన్నా అన్నాడు.

అ... సెప్పురా అంజీ... అంత బాగేనా అన్నా!

అన్నా ఇన్నే ఊండవన్న అన్నడు. ఏడరా అన్న!

హాస్పిటల్‌లో అని అన్నడు.

ఏమైందిరా... ఎవరికైనా ఆపతైందా? అని అడ్గితి.

అవునన్నా. నాయినకు ఉబ్బాసం ఎక్కువైంది.

కిందమీన సేస్తె కందనూలికి ఎస్కొచ్చినమ్.

మాగ్గీడ ఎవరు తెలుస్తలేరు. నీవు రా అన్నా. దండంబెడ్తన్నడు అంజి.

డాక్టర్లు ఉన్నరా అని నేనంటి.

ఆ.... ఉంద్రు. కాని సూస్తలేరనవట్టె.

ఎందుకు... రా....!

ఏమో. గీవులాడంగా గీవులాడంగా డాక్టరు, గిట్ల సెయ్యివట్టి సూసిండు.

సిరియస్‌గా ఉంది. ఊపిరితిత్తులు సెడిపోయినయ్. పాలమూరు కన్నా లేక పట్నమన్నా ఎంబటే తీసుకపొండ్రి అని సిట్టి రాసిండు. నీవు రా అన్నా తొందరగా అన్నడు.

ఆ... వొస్తుండ. ఏమి అదుర్కొకుండ్రి అని పోయిన.

బండి కీస్ తిస్కొని మెట్లపొంటి దిగిపోతుంటే మెట్ల సప్పుడిని మా యామె లేసింది.

యాడ్కో పోతుండవ్ సెప్పకుండా....

హాస్పిటల్‌కు...

ఎందుకు ఎవరికేమైంది...

మీ మావను సర్కారు దావఖానకు తీస్కొచ్చిండ్రంటా.

యా మావ. మళ్లో ప్రశ్న...

మీ గోదల్ మావ. ఈదన్న కక్కయ......

ఏమైందంటా?

ఉబ్బాసం ఎక్కువైందంట.

భద్రం ఇల్లు గడెస్కో అని బండి కిక్ గొట్టి దావఖానాకు పోతి.

*    *    *    *

నేం బోయాటలకు మాయత్త, అంజిగాడు, మా బావమర్ది రాము ఏడ్సుతుండ్రు. డాక్టరును కల్సిన. ఎమర్జెన్సి ఉంది తీస్కపొండ్రి అన్నడు. సర్ ఈ నాత్రి ఎక్కడదీస్కపోతమ్.

మీరు సూడమంటె సూస్త. కాని సంతకం బెట్టాలే. గట్లే సర్.

ఇంగ గప్పుడు గుల్కోస్ పెట్టమని నర్స్‌కు సెప్పిండు. ఆమె మంచి నిద్రమబ్బున ఉంది. నరాలు దొర్కుతలేవ్. పస్స పస్స గుచ్చుతుంది. బొడిక్కిన రక్తం వొస్తుంది. కాని నరాలు దొర్కుతలేవ్ అంటుంది. కుచ్చి కుచ్చి దొర్కిచ్చుకుంది. గుల్కోస్ ఎక్కుతుంది. ఈదన్న కక్కయ్య కోడి గుండె కొట్టుకున్నట్లు కొట్టుకుంటుండు. ఎదలు ఎగపోస్తుండు. ఊపిరి తీస్కోవడం ఆయాసంగా ఉంది. కడ్పు ఎగేస్తుండు. అంజిగాడు పెండ్లికాని పిలగాడు. ఎక్కీలు పట్టేట్లు ఏడుస్తుండు. ఇంగా రాత్రంతా జాగారమె. కోళ్లు కూసే పొద్దయింది. తెల్ల తెల్లారింది. తెల్లారంగా ఆ దినం ఆయితారం. కందనూలులోనే ఎమ్.డి. డాక్టర్ నవీన్‌నుంటాండు. గాయనది ప్రయివేటు దావఖాన. సర్కారు దావఖానకొచ్చి గిట్ల సూడుండ్రి సారంటే... రానంటడు. గాడ్కె అంబులెన్స్‌లో తీస్కపోతిమి.

గీ డాక్టర్‌కు మంచి పేరుంది. ఎసొంటి కేసయిన, ఎంత సీరియసున్న దైర్నంజేసి పడ్తడు. తక్కువజేస్తడు.

నాత్రి సాపుగున్న మనిషి పొద్దెక్కెటాలకు కాల్జెతులు, మొకం వాసింది.

వాపులెన్నిదినాలాయొచ్చి అని డాక్టరు అడిగిండు.

నాత్రిసందే సారు అని సెప్పితిమి.

గుండె పరీచ్చ, కిడ్ని పరీచ్చ సేయలన్నడు. సరేనన్నమ్. గంటసెపట్ల రిపోట్లొస్తయ్ బయటుండుండ్రి అంటె సరేనని బయటికొస్తిమి.

గంటైనాక మల్ల పిల్సిండు. రిపోట్లొచ్చినవి. ఈయనకు కిడ్నిలు ఫైయిల్ అయినవి. కష్టం. డయాలసిస్ సేయాలన్నడు. పాలమూర్కి తీస్కపొండ్రి. జెల్ది లేట్ సేయొద్దన్నాడు.

మా అంజిగాడ్కి కండ్లపొంటి నీళ్లు కారుతనే ఉన్నై.

*    *    *    *

హాస్పిటల్‌కు వొచ్చిన రోజు అగులుబుగులుతోటి వొచ్చిండ్రు. వొక్క పైసలేదు. అగ్గడబగ్గడ వొచ్చుట్ల వో దుప్పటిగీన తీస్కరాలేదు. నేనే అంబులెన్స్ మాట్లాడితి. అందరంబట్టి అంబులెన్స్‌లో పండవెడ్తిమి. ఈదన్న కక్కయ్య అయాసం ఏం తగ్గలే. మనిషితిట్టు సూడబుద్దైతలేదు. ఒక్కటే ఎగతేకుతుండు. కస్సకస్స దగ్గుతుండు. డాక్టరును గీవులాడితే ఆక్సిజన్‌ను అంబులెన్స్‌లో పెట్టిండు. డ్రైవర్ అంబులెన్స్‌ను గంటల పాలమూర్ల నిలిపిండు. ఎస్.వి.ఎస్. హాస్పిటల్‌కు తీస్కపోతే గీడ డయాలసిస్ సెయ్యరంట. గవిరిమెంటు ఏరియా హాస్పిటల్‌కు ఉరికిచ్చిండు డ్రైవర్‌సాబ్ బండిని. అండ్ల తీస్కపోతే గీడగూడ డయాలసిస్ లేదు. మీరు పట్నం పోవాలే అని గాడకూడ గిట్లనే అనిండ్రు. అయితే ఆల్చం లేకుంట పోదం పట్నం మని అంజిగాడ్ని, మాయత్తను, మా మామను రడీగమ్మన్న.

అంజిగాడు ఏడ్సుకుంట పట్నంబోతే ఎంతైతది ఖర్సని అడిగిండు.

యాప్పైయేలు గావాల్రా అని సెప్పిన. యాభైవేలతో తక్కువైతదా అనవట్టె. మొదలు యాబైవేలు కావాలి. ఇంగ వారం వారం పట్నం వొచ్చి డయాలసిస్ సేయాలి. కందనూలులో డయాలసిస్ చేసే దావఖాన లేదు.

మా అత్త మా మామ, అంజిగాడు ఖంగుతిన్నరు. వారం వారం రావాల్నా అని ఉక్కిరి బిక్కిరైయిండ్రు. ఎదో ఒకసారి యాబైవేలంటే అప్పొసప్పొ జేసి పెడ్తం. గాని వారవారంటే ఎట్లెల్లుతది అని ఫికరు జేస్తుండ్రు.

వారవారం పట్నం ఎవరు తీస్కపోతరు. మేము ఆకు అలం తిని బత్కెటోల్లం. అయితే గియితే ఊర్కాడ ఎకర సెల్కుంది. గదిగిట్ల అమ్మితే సరిపోవొచ్చు అంజిగాడంటుండు.

అరె అంజి ఇప్పుడు ఆలోసించనీకె టైములేదు. నేను యాపైవేలు ఇస్త. తర్వాత నాకిత్తురుగాని అని సెప్పిన.

అంజిగాడంటుండు అన్న గిజ్జేయకపోతే నాయిన బత్కడా?

బత్కడ్రా...! కిడ్నీలు పాడైతే మనిషికి దొడ్డికి, మూత్రం రాదు.

దొడ్డికి, మూత్రం బయట్కి పోకపోతే రగుతం ఇన్‌ఫెక్షన్ అవుతుంది. ఇన్‌ఫెక్షన్ అయిన రగుతం పయ్యింతటా పాకి మనిషి సచ్చిపోతడని సెప్పిన. గొల్లున ముగ్గురేడ్సింంద్రు. గిదంత అంజిగాడు, మా అత్తమామలు పక్కకోయి సోచాయించింద్రు.

ఇంగెక్కడొద్దు పొయ్యి. ఇంటికేస్కపోదం అని మా మామ అంటుండు. పిల్లలు జూస్తే సిన్నోలు. ఆడ పెదగ ఏం ఆస్తిపాస్తుల్లెవ్. ఆ ఈ రోగానికి కుండలు గురుగులు అమ్మిన సాలవు. సస్తె సస్తెపా! ఆయనకిప్పుడు డెబ్బయేండ్లు. గిప్పుడాయన గడెం దున్నేదుందా! అని అంటుండు. అంటే పన్జేయని మనిషి బత్కి ఏం లాపం లేదని మా మామ సెప్పకనే సెప్పుతుండు. పన్జేయడానికే మనిషి బత్కాలని అర్థం.

వొద్దు మామ. పట్నమే పోదం. మనం సేసే ప్రయత్నం మనం జేద్దం అని జెరంత గట్టిగనే సెప్పిన. లేకపోతే మనకండ్ల ముంగటనే పానం ఇడ్సుతడు. దీనినే సూడలేను. నా మన్సొప్పదు. ఎంతనన్నా గాని, ఏమైనగాని నూరు ఆరైన, ఆరు నూరైన మనం పట్లం పోవాల్సిందే. పెద్ద దవఖానలా సూపియాల్సిందేనని మల్లోసారి గట్టిగజెప్పిన.

ఈదంత ఈదన్న కక్కయ్య ఇంటుండు. మాట్లాడనికే ఇబ్బందివడుతుండు. శగితినంత కూడ దీస్కొని మాట్లాడుతుండు. వొద్దుపా బిడ్డా. మనం ఇంటికోదం. బతికితె బతికితి, సస్తె సస్తెగాని, నన్ను ఇంటికి తీస్కపోంద్రి అని సెప్తుండు. పిల్లలు సిన్నోళ్లు. వాళ్లకు అప్పులు పెట్టొద్దు. బతికితె బట్టల్ల పెటుంద్రి. సస్తెమంట్ల పెట్టుంద్రి. వారవారం ఐదువేలు పెట్టమంటే యాడ్కెల్లివెత్తరు పిల్లలు. సచ్చెముందర ఊర్నుజూస్త, ఇల్లు సూస్త, ఇడుపు సూస్త. గొడ్లు గోద సూస్త. నన్ను హాస్పిటల్‌కు తీస్కపోవొద్దు. ఇంటికె తీస్కపోంద్రి అంటుండు ధైర్నంగా.

వొద్దు కక్కయ్య హాస్పిటల్‌కే పోదం.

ఎంతనన్నా గాని నేనిస్త... పా...

వొద్దు బిడ్డా. నీవు మాత్రం ఎంతగానం ఇస్తవ్.

నేను సచ్చినాక బాకి తీర్చాలంటే ఇబ్బందిపడ్తరు. పిల్లలు సిన్న కొద్దొలు. వొద్దు వాళ్లను ఇబ్బంది పెట్టొద్దు. పొంద్రి నన్ను జెప్పున ఊర్కితీసకపోంద్రి మీకు దండంబెత్త. అని పబ్బతి పట్టిండు...

అంజిగాడు ఆరోగ్యశ్రీ కారటు వుందిగాద ఫిరిగా చూడరా అన్న పట్నంల అంటుండు. ఇది సెల్లదంటర అని సెప్పిన. వాళ్లెంత సెప్పినా వినకపోతే బండి మలిపినం. పట్నం పోవాల్సిన అంబులెన్స్ మళ్ల గోదల్‌కు మలిపినం. నాకు మనస్సంత నల్లగైంది. గుండె పీకుడు ఎక్కువైంది. కడుపు మండుతుంది. ఊరికోయటాలకు సస్తడుగావొచ్చు అనుకున్న. నేను సైలెంట్‌గా అంబులెన్స్‌ల కూసున్న. అంబులెన్స్‌తో సమానంగా నా కడుపుల బాధ కూడా ఉరుకుతుంది. కండ్లల్ల నీళ్ళు తిర్గుతున్నయ్. గంటన్నరల అంబులెన్స్ గోదలుకు చేరింది. మంచం మీద పండబెట్టినం.

* * * *

ఊరిమొకం మలిపినాక మనషి ఆయాసం కొంచెం తగ్గుమొకం పట్టింది. తేలెకండ్లేస్తున్నోడు... ఊర్ను జూసి కండ్లు తెరుస్తున్నడు. ఆయింత ఊరిగాలి తలుగుట్ల ఉశారైండు. పెయ్యిమీది బట్టలు వొక్కడె ఎగనూక్కుంటుండు.

ఈదన్న కక్కయ్యకు పానం బాగలేని సంగతి ఊరంత పాకింది. ఆ నోట ఈ నోట ఇ వార్త కాకి గోలలాగైయింది. ఊరు ఊరంత కట్టకట్టుకొనొచ్చింది. ఎక్కువొల్లు, తక్కువొల్లు అని అనకుంట పల్కరిస్తుండ్రు.

ఎట్లుందే ఈదన్న పానం అని అంటుండ్రు. ధైర్నంగుండు. మేమంతా లేమా పిల్లలకు. ఇసారిస్తుండ్రు. పాయిరయసోంటి మనిషి. కులాన్కి మాదిగోడైన గుణంల గొప్పోడని అనుకుంటుండ్రు. ఆకిలి నిండిపోయింది. శోకం కండ్ల నుండి కారుతుంది. అందరు ఏడ్సుతుండ్రు...!

ఈదన్న కక్కయ్య వొచ్చినోల్లందరికి సెయ్యి కలుపుతుండు. ఆకిలి మందితోటి నిండి, నిండు సెరువులా లాగయింది.

వొచ్చినొల్లు వొచ్చినట్లు ఈదన్న మంచిసెడ్డలు గురించి చెప్పుకొంటుండ్రు. ఎన్నడు ధర్మం తప్పనోడు. సీమగూడా అన్యాలం చేయనోడంటుండ్రు. మాటకు పాటువడ్డడంటుండ్రు. ఎవ్వల్లను పల్లెత్తి మాటన్నోడు కాదు. సిన్నప్పట్నించి దోస్తాని చేసిన్నోళ్లంత ఒక్కొక్కరోస్తుండ్రు. పలకరిస్తుండ్రు. సిన్ననాటి సిత్రాలను గ్నాపకం జేసుకుంటుండ్రు. పనికి దిగిండంటే ఎద్దోలే పనిజేస్తుండె. సిన్నప్పట్నుంచి మాద్గిర్కంజేసిండు. ఏడ ఏ పనిజేసిన, ఏలెత్తి సూపిచ్చుకోలే.

ఈదన్న కక్కయ్య ఊరిని మెప్పించడానికి సెప్పులే కారణం. సచ్చిన గొడ్లనొలిసి తోలు కర్రగల్లలో నానేసి, మురిగిన తోలును ముద్దుగా కడిగి, ఎండలో నానవెట్టి తోలుసాపుజేసెటోడు. సిన్నపెద్ద తేడా లేకుండా ఊరికంత సెప్పులజతలు సేసెటోడు. ఊరు ఊరంత సెప్పుల్తొడుక్కొని నడుస్తుంటే ఆనందపడెటోడు.

సెప్పుల్జేసుడే అతని పపంచం. అతన్జేసిన సెప్పుల్జూస్తే అతనికి సెప్పరాని ఆనందం. సెప్పుల్జేసుట్ల పుట్టి, సెప్పుల్జేసుట్లనే పెరిగిండు. సెప్పులే అమ్మ కౌగిలనుకునేటోడు. మునివేళ్లతో సెప్పులను ముద్దాడెటోడు. పాదాలు సాపుగుంటెనే మనిషి సాపుగుంటడని నమ్మెటోడు. తాన్జేసిన సెప్పులే ఊరి పాదాలను ముండ్లనుంచి, పెంటనుంచి, రాళ్లనుంచి కాపాడుతున్నై అనుకునేటోడు. కుక్కలు కొరికేసిన సెప్పుల్ని కసురుకోకుండా బాగుజేస్తుండే. ఉంగుటం పోయిన చెప్పుల్ని, కప్పూసిపోయిన సెప్పుల్ని, ఉంగుటం బిగ్గరయిన సెప్పుల్ని గుటంతో గూటించేటోడు. సెప్పుల్ని ఊరికి ఆయుధంగా మలసినోడు. సిన్న పిల్లలకు పూలువెట్టి కుచ్చుల సెప్పులు, కిర్రుసెప్పులు చేసేటోడు. చెప్పుల్జేసి ఊరికి రక్షనైనోడు. అందుకే ఊరు ఈదన్న పట్ల అంత పేమ సూయించింది.

*     *     *     *

ఈదన్న కక్కయ్య హైబత్ పడ్తలేడు. హిమ్మత్తున్నడు. ఇంగసస్తనన్న పరేషాన్ ముఖంల కనవడ్తలేదు. కండ్లుగిట్ల కడిగిన ముత్యంలాగున్నయ్.

అందరు గిట్ల మాట్లాడుకుంటుండంగా ఊరి సర్పంచి జగన్మోహన్‌రెడ్డి పల్కరించనీకే వొచ్చిండు. లేసి కూసోనికే సూస్తుండు సర్పంచిని చూసి అందరు పక్కకు జర్గి, పోనీకే సందిచ్చిండ్రు.

ఎట్లుంది ఈదన్న పానం.... జగన్మోహన్‌రెడ్డన్నడు.

జీవం ఎల్లిపోతుంది పటేలా... ఈదన్న సెప్పిండు.

ఇంగ నాకు ఈ భూమ్మీద నూకల్లేవ్ పటేలా. పాణం తోడెస్తున్నట్లుంది. జీవాత్మ అటు, ఇటు గుంజుతుంది పాణం ఎల్లిపోయినట్లు ఎల్లిపోయి మల్ల ఎన్కికోస్తుంది. నాకు శ్యాల సంతోషంగున్నది. హస్పిటల్‌లో అయితే

నేను పోయినాక నన్నెవరు పల్కరీయపోతుండ్రి. మీ పల్కరింపుకు నా మనస్సు కుదటపడింది. నా అనంతరం మా కుటుంబాన్ని సల్లగ సూడుండ్రి. నేనేమన్న తప్పు జేసుంటే వొదిలేయండ్రి. ఇన్నాండ్లు నేను ఒంటరిగాన్ని అనుకున్నా. ఇంతమంది నా వాళ్లున్నారన్న సంతోషం నాకు నేను సచ్చిపోతుండ అన్న బాధను మరిపిస్తుంది. నా గురించి గాన్ని, నా మంచి, చెడ్డల గురించి ఎక్కువ ఆలోసించకండ్రి. ఎయ్యేండ్లు ఎవరు బత్కరు. బత్కినన్నిరోజులు నీతిగా బత్కడానికి సూసిన. ఊరు ఊరంత నా కోసం వచ్చిండ్రు. సిన్న పెద్ద అందరికి సెనార్థులు. నా ఆఖరు గడియలు నాకు శ్యాన సంతోషంగుంది. కాలం ఆగదు. అందరం కాలంతోపాటు నడవాల్సిందే. నేనిప్పుడు ముసలోన్ని. ఏండ్లు నిండాయి. పండాకు ఎన్నటికైన రాలిపోవాల్సిందే. పూర్తి పాతదైపోయిన బండి ఇంగ నడవదు. నా శలీరం గూడా బండిలాగయ్యింది. నేనెళ్లిపోతున్నా. అని కంటతడి పెడ్తున్నడు. నేను సస్తే సస్తిగాని. నా సిన్నకొడుకు అంజిగాడి లగ్గం జూడకపోతి. పెద్దోన్ని మల్లిగాడ్ని ఓ యింటోడ్ని సేసిన. వాడి బత్కు వాడు పట్నంపోయి బత్కుతున్నడు అని సెపుతుండు. సిన్నోడేడి అని అడిగె. అంత దూరాన అంజిగాడు ఏడ్సుకుంట కూసున్నడు. ఒక్కపారి దగ్గరికి రమ్మన్నడు. అంజిగాడు దగ్గరికిపోయిండు. అందరొకసారి గొల్లున ఏడ్సిండ్రు. కొందరు ఆడోళ్లు కొంగులు మొకానికి పెట్టుకొని సొంతింటి మనిషి కోసం ఏడ్సినట్లు ఏడ్సుతుండ్రు. కొందరు సేతులు సాపి ఏడ్సుతుండ్రు. సర్పంచిగూడ కంటతడి పెడ్తుండు. అందరు ఏడ్సుతుండంగానే పట్నం నుంచి పెద్దకొడుకు మల్లిగాడు పెండ్లాన్ని తోల్కొని వచ్చిండు.

మల్లోపారి మందంత గట్టిగేడ్సుతుండ్రు. మల్లిగాడు ఏడ్సుతుండు. మల్లిగాడి పెండ్లాం నీళ్లు పోసుకున్నది. తొమ్మిది నెలలు నిండినయ్. రేపో మాపో కంటది అన్నట్లు ఉంది. పెద్దకొడుకును సూసినాక ఇంగా సంతోషపడ్డడు. కోడల్ని కండ్లార సూసిండు. కడుపు మీద సెయ్యివెట్టి కోడలు కడుపుల ఉన్న పసిగుడ్డును ఆశీర్వదించిండు. అందరికి మల్లొకపారి పబ్బతి పెట్టిండు. అందరిని సూసుకుంటనే నవ్వుతుండు. మనిషి నవ్వుతుండంగానే మాటలు పడిపోయినయ్. తెరుసుకున్న కండ్లు మూసుకున్నై. ఈదన్న కక్కయ్య గాలి, గాలిలో కల్సింది. ఊరంత ఏడ్పుల దిబ్బగా మారింది.

ఆకిట్ల ఓ తుమ్మ మొద్దుంటే, ఆ మొద్దు మీద కూసున్న నేను, జల్లున జొన్న గింజల్లాగా కన్నీరు సుక్కలు రాల్సిన. నేను ఏడుపు ఎంత ఆపుకుందమనుకున్న ఆగుతలేదు. పైసలను మనిషె తయారుజేసిండు. గా పైసలే లేకపోవుట్ల మనిషి సచ్చుడేందని నాకు మనస్సంత గెల్కినట్లయ్యింది. మనిషి పాణం కంటే పైసలకే విలువుందని బాధనిపిచ్చింది.

* * * *

ఊరు ఊరంత శవయాత్రలో పాల్గొన్నది. అందరు ఘనంగా ఈదన్న కక్కయ్యను సాగనంపిండ్రు. అందరు బొందవెట్టి ఇంటికొచ్చిండ్రు. కాళ్లైతులు కడుకుంటుండగానే, ఈదన్న కక్కయ్య పెద్దకోడలు నొప్పులుదీస్తున్నది. సూస్తున్నంగనే అల్కగా కన్నది. పిల్లనా? పిలగాడా? అని మందంతా ఎగవడరు. పిల్లగాడే అన్నరు. ఓ ఈదన్న మంట్లోకోయిండు. ఇంగో ఈదన్న మందిలకొచ్చిండు అని ఎవల ఇండ్లకు వాళ్లు పోయిండ్రు.

**గుడిపల్లి నిరంజన్**

**సెల్ : 94933 19878**

**niranjangudipally@gmail.com**

**తేది : 15.07.2016**